www.aksharadarbar.com
శనివారం 25, మే 2024
అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక వరంగల్ | సంచిక :95 | సంపుటి :02 | పేజీలు : 05 | వెల : 05

మర్డర్ కేసులో నిందితుడు అరెస్ట్

ఆరు నెలల క్రితం జరిగిన హత్య కేసును ఛేదించిన పోలీసులు

05

కన్నకొడుకుని కడతేర్చిన కసాయి తండ్రి

మృతుడు సాయి గణేష్ (ఫైల్)

మద్యం దుకాణాల బంద్

వరంగల్‌నల్లగొండఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక సందర్భంగా మద్యం దుకాణాలు బంద్ చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాలు జారీ చేశారు. ఈనెల 27వ తేదీన ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 48 గంటల పాటు మద్యం దుకాణాలు మూసివేయాలని ఉత్తర్వులు జారీచేశారు.

02

– అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

వరంగల్ ఖమ్మం నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని వరంగల్ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి పి. ప్రావీణ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుందని పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 43,812 మంది పట్టభద్రుల ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని తెలిపారు.

02

– అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి

గన్ పౌడర్ పరిశ్రమలో పేలుడు

17 మంది మృతి

ఆరుగురికి గాయాలు

05

తారెత్తిస్తున్న ఖరే

మధ్యపేజీలో..

ఆఫీసర్ లైఫ్ స్టైల్

మాఫియాలో గుబులు రేపారు. అక్రమార్కుల్లో కలవరం సృష్టించారు. ఇసుకాసురులను హడలెత్తిస్తున్నారు. భూకబ్జాదారుల గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తున్నారు. వడ్డీ వ్యాపారుల్లో వణుకు పుట్టించారు. పీడీఎస్ రైస్, బెల్లం వ్యాపారులను టెన్షన్ లో పడేశారు. గంజాయి రవాణా దారులపై ఉక్కు పాదం మోపుతున్నారు. నక్సల్స్ కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించారు. మొత్తానికి అసాంఘిక శక్తులను తారెత్తిస్తున్నారు. ఆయనే జయశంకర్ భూపాలపల్లి జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్పీ) కిరణ్ ఖరే. రాష్ట్రంలో మావోయిస్టు ప్రభావిత జిల్లాల్లో భూపాలపల్లి ఒకటి. మూడు రాష్ట్రాల సరిహద్దులో గల ఈ జిల్లాలో ఎస్పీగా కిరణ్ ఖరే తమదైన ముద్ర వేస్తున్నారు. శాంతి భద్రతల నిర్వహణలో తనదైన శైలి కనబరుస్తున్నారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజలతో మమేకమవుతున్నారు. సమస్యలతో పోలీసులను ఆశ్రయిస్తున్న ఫిర్యాదుదారులకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. విధి నిర్వహణలో తప్పు చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటున్నారు. అటవీ, మైదాన ప్రాంతం, మావోయిస్టుల ప్రభావం, బొగ్గు గనులు, కేటీపీపీ, ఇసుక క్వారీలు, కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ, అన్నారం వంటి బ్యారేజీలు, పెంపు హౌస్ లు కలిగి ఉన్న ఈ జిల్లాలో గత ఎనిమిది నెలలుగా పనిచేస్తున్న భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరేపై 'అక్షర దర్బార్' స్పెషల్ స్టోరీ.

–అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి

- సరిహద్దులో మాఫియాలకు గుబులు
- అక్రమార్కులు, అసాంఘిక శక్తుల్లో కలవరం
- పీడీఎస్ రైస్, బెల్లం వ్యాపారుల్లో కలకలం
- అధిక వడ్డీ వ్యాపారుల్లోనూ వణుకు
- భూ కబ్జాదారులు, గంజాయి రవాణా దారులపై ఉక్కుపాదం
- ఇసుకాసురులపై గట్టి నిఘా
- నక్సల్స్ కార్యకలాపాలపై స్పెషల్ ఫోకస్
- ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక పీఎస్ ఏర్పాటు
- ఆకస్మిక తనిఖీలతో హడల్
- ప్రతి సోమవారం 'ప్రజాదివస్'కు శ్రీకారం
- సైబర్ నేరాలపై ప్రజల్లో చైతన్యం
- శాంతి భద్రతల నిర్వహణలో తనదైన మార్క్
- భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరేపై 'అక్షర దర్బార్' స్పెషల్ స్టోరీ

సీఎంతో వామపక్ష నేతల భేటీ

కాంగ్రెస్ కు సంపూర్ణ మద్దతు

వామపక్ష పార్టీల నేతలు శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా హస్తం పార్టీకి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు వెల్లడించారు. సీపీఐ, సీపీఎం, తెలంగాణ జన సమితి నేతలు ప్రొఫెసర్ కోదండరాం, ప్రొఫెసర్ విశ్వేశ్వర్ రావు, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జూలకంటి రంగారెడ్డి, ఎస్.వీరయ్య, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్, మల్లు రవి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, బొంతు రామ్మోహన్, తదితరులు ఈ భేటీకి హాజరయ్యారు. నల్గొండ ఖమ్మం వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక, చివరి రోజు ప్రచార సరళిపై చర్చించారు.

05

— అక్షర దర్బార్, హైదరాబాద్

అక్షర దర్బార్ voice of the people తెలుగు దినపత్రిక

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి: వరంగల్ – ఖమ్మం – నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని వరంగల్ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి పి. ప్రావీణ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుందని పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 43,812 మంది పట్టభద్రుల ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని తెలిపారు. ఇందులో 27,038 మంది పురుషులు, 16,774 మంది మహిళలు ఉన్నట్లు వివరించారు. జిల్లా వ్యాప్తంగా 11 రూట్లు, 23 లోకేషన్లు, 59 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. వరంగల్ మండలంలో 21 , ఖిలా వరంగల్ మండలంలో 10 , గీసుగొండ 4, సంగెం మండలంలో 3, నర్సంపేట మండలంలో 5, నెక్కొండ,పర్వతగిరి, రాయపర్తి, వర్ధన్నపేట, ఖానాపూర్, చెన్నరావుపేట, నల్లబెల్లి, దుగ్గొండి మండలాలలో రెండు పోలింగ్ కేంద్రాల చొప్పున సిద్ధం చేసినట్లు వివరించారు.

ముగిసిన ప్రచారం

గత కొద్ది రోజులుగా అభ్యర్థులు జోరుగా ప్రచారం చేశారు. వీరి ప్రచారానికి తెరపడింది. బల్క్ ఎస్ఎంఎస్ లను కూడా ఎన్నికల కమిషన్ నిషేధించింది. వరంగల్ -ఖమ్మం- నల్గొండ పట్టభద్రుల స్థానం పరిధి 34 అసెంబ్లీ, 5పార్లమెంటు, 11 జిల్లాల్లో విస్తరించి ఉంది. మొత్తం ఓటర్లు 4,61,806 మంది ఉండగా ఇందులో పురుషులు 2,87,007 మంది, మహిళలు 1,74,794 మంది, ఇతరులు ఐదుగురు ఉన్నారు. 600 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. బరిలో 52మంది నిలిచారు. ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థుల మధ్య పోటీ నెలకొంది. పార్టీలు ఎమ్మెల్సీ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. గెలుపే లక్ష్యంగా ముఖ్యనేతలంతా క్షేత్రస్థాయిలో ప్రచారం నిర్వహించారు. వివిధ విద్యాసంస్థలను, కార్యాలయాలను సందర్శించి ఓట్లు అడిగారు. గ్రాడ్యుయేట్లతో సమావేశాలు నిర్వహించి వారి గళాన్ని వినిపించారు.

పాఠశాలలో పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ భవేష్ మిశ్రా

జూన్ 10లోపు పనులను పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా

అక్షర దర్బార్,రేగొండ : అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులను జూన్ 10 లోపు పూర్తి చేయాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశించారు. శనివారం మండలంలోని బాగిర్తిపేట, గూడెప్పల్లి, మడత పల్లి, రంగయ్యపల్లి, గోరి కొత్తపల్లి మండలంలోని రూపిరెడ్డిపల్లి, చిన్నకోడెపాక గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పురోగతిని కలెక్టర్ భవేష్ మిశ్రా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ భవేష్ మిశ్రా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాల కల్పనకు మరమ్మత్ పనులు చేపట్టినట్లు తెలిపారు. పాఠశాలలు పునఃప్రారంభం నాటికి అన్ని పనులు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. మండలంలో 26 పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కింద రూ.కోటి 17 లక్షలతో పనులు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. పాఠశాలలో విద్యుత్, మంచినీరు, మరుగుదొడ్లు, హ్యాండ్ వాష్ ప్లాట్ ఫాం వంటి మౌలిక వసతులను కల్పిస్తున్నట్లు తెలిపారు. మన ఊరు- మన బడిలో చేపట్టిన పనుల్లో ఎక్కడైనా పెండింగ్ ఉంటే రానున్న మూడు రోజుల్లో ప్రతిపాదనలు అందచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శామ్యూల్, ఎంపీడీవో వెంకటేశ్వరరావు, ఎంపీవో రామ్ ప్రసాదరావు, టీజీఈడబ్ల్యూఐడీసీ ఏఈ రాజు, వీవోలు సుజాత, లావణ్య, సుమలత, శోభ, స్వప్న, రమాదేవి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

అక్షర దర్బార్, జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : భూపాలపల్లి మండలం కమలాపూర్- రాంపూర్ గ్రామాల మధ్య అడవిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు భూపాలపల్లి పోలీసులు తెలిపారు. మృతుడి వయసు సుమారు 30 నుంచి 35 ఏళ్ల మధ్య ఉంటుందని తెలిపారు. వివరాలకు భూపాలపల్లి సీఐ 8712658110, ఎస్సై 9849199774 సెల్ నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.

నిరుద్యోగుల కోసం పోరాడిన వ్యక్తి తీన్మార్ మల్లన్న

-జిల్లా కాంగ్రెస్ నాయకుడు సాయిలి ప్రభాకర్.

అక్షర దర్బార్, సంగెం : నిరుద్యోగుల సమస్యల కోసం నిరంతరం పోరాటం చేసే తీన్మార్ మల్లన్నను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని జిల్లా కాంగ్రెస్ నాయకుడు సాయిలి ప్రభాకర్ కోరారు. ఇలాంటి వ్యక్తి చట్టసభల్లో ఉంటే నిరుద్యోగులు, ప్రజల సమస్యలపై పోరాడి వాటి పరిష్కారానికి కృషి చేస్తాడని అన్నారు.

సబ్ రిజిస్ట్రార్ సస్పెన్షన్

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి : ఖిలా వరంగల్ ఇన్చార్జి సబ్ రిజిస్ట్రార్ రాజేష్ ను సస్పెండ్ చేస్తూ జిల్లా రిజిస్ట్రార్ రవి ఉత్తర్వులు జారీ చేశారు. సబ్ రిజిస్ట్రార్ కార్తీక్ సెలవుపై వెళ్లడంతో రాజేష్ కు ఇన్ ఛార్జి బాధ్యతలు అప్పగించారు. నిబంధనలు పాటించని వెంచర్ లో 26ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయడానికి రాజేష్ అభ్యంతరం తెలపకపోగా, పూర్తిగా సహకరించాడు. రెండు రోజుల్లోనే 26 ప్లాట్ల రిజిస్ట్రేషన్లు వేగంగా జరిగిపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఒక్కో డాక్యుమెంట్ కు రూ.30వేలు అదనంగా వసూలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. విషయం ఉన్నతాధికారులకు తెలిసి విచారణ చేపట్టారు. నిబంధనలు పాటించని వెంచర్లో ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేసినట్లు తేలడంతో స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ సుభాషిణి ఆదేశాల మేరకు జిల్లా రిజిస్ట్రార్ రవి ఖిలా వరంగల్ ఇన్ ఛార్జి సబ్ రిజిస్ట్రార్ రాజేష్ ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. డాక్యుమెంట్లపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టనున్నారు.

పనులు వేగంగా పూర్తి చేయండి

వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య

మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి : అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి పనులను పాఠశాలలు పునఃప్రారంభం కాకముందే పూర్తిచేయాలని వరంగల్ కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి, డీఆర్డీవో కౌసల్యదేవితో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. వేగంగా నాణ్యతతో పూర్తి చేయుటకు ఇంజినీరింగ్ అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఆదర్శ పాఠశాలల కమిటీలచే గుర్తించిన 459 ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టగా 131 పాఠశాలల్లో అభివృద్ధి, సుందరీకరణ పనులు పూర్తయ్యాయన్నారు. మిగతా పాఠశాలల్లో పనులు పురోగదశలో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సమీక్షలో ఇంజనీరింగ్ అధికారులు సంజయ్ కుమార్, రవి కిరణ్, సారంగం, రంగారావు, పంచాయతీ రాజ్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

వార్డు ఆఫీసర్ల నూతన కమిటీ ఏకగ్రీవం

అక్షర దర్బార్, మరిపెడ : మరిపెడ మున్సిపాలిటీ వార్డు ఆఫీసర్ల యూనియన్ నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. మున్సిపాలిటీలో జరిగిన వార్డు ఆఫీసర్ల సమావేశంలో కమిటీ అధ్యక్షుడిగా గుర్రాల రాములు, ఉపాధ్యక్షుడిగా వేల్పుల వెంకట నారాయణ, ప్రధాన కార్యదర్శిగా బోడ మంగీలాల్, కోశాధికారిగా టి.రాధికను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మద్యం దుకాణాలు బంద్

ఉత్తర్వులు అతిక్రమిస్తే చర్యలే: సీపీ

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి: వరంగల్-నల్లగొండ-ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక సందర్భంగా మద్యం దుకాణాలు బంద్ చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాలు జారీ చేశారు. ఈనెల 27న ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 48 గంటల పాటు మద్యం దుకాణాలు మూసివేయాలని ఉత్తర్వులు జారీచేశారు. శనివారం సాయంత్రం 4గంటల నుంచి 27న సాయంత్రం 4గంటల వరకు మద్యం దుకాణాలు బంద్ చేయాలని తెలిపారు. ఎవరైనా ఉత్తర్వులను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సీపీ హెచ్చరించారు.

పంప్ హౌస్ పునరుద్ధరణ పనుల్లో వేగం పెంచాలి

జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా

అక్షర దర్బార్ జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : భీరసాగర్ వద్ద పంప్ హౌస్ పునరుద్ధరణ పనుల్లో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. శనివారం ఐడీవోసీ కార్యాలయంలో భీరసాగర్ పంప్ హౌస్ మరమ్మతు పనులు, మందిరం, ఎర్ర చెరువులకు చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు నుండి నీటి సరఫరా తదితర అంశాలపై రెవెన్యూ, ఇరిగేషన్, విద్యుత్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంప్ హౌస్ పునరుద్ధరణ పనులు పురోగతిలో ఉన్నాయని, వేగం పెంచాలని అన్నారు. పంప్ హౌస్ ముంపునకు గురికాకుండా కాంక్రీట్ తో పటిష్టమైన రక్షణ గోడ నిర్మించాలని తెలిపారు. గారేపల్లి పంప్ హౌస్ వద్ద సబ్ స్టేషన్ నిర్మాణ పనులను 15 రోజుల్లోగా పూర్తి చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. గారేపల్లి చెరువు అభివృద్ధి కోసం భూసేకరణ, పైపు లైన్ వేయడం పోలారం, రుద్రారం ట్యాంకుల భూ సేకరణకు ప్రతిపాదనలు అందచేయాలని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ ఈఈ యాదగిరి, విద్యుత్ ఎస్ఈ మల్చూర్, ఆర్డీవో మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

నీటి వనరులను కాపాడుకోవాలి

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి : నగర పరిధిలోని చెరువు గట్ల వెంబడి మొక్కలు నాటాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాఖడే అన్నారు. బల్దియా ప్రధాన కార్యాలయంలో హార్టికల్చర్ అధికారులతో శనివారం జరిగిన సమావేశంలో కమిషనర్ మాట్లాడారు. తక్కువ సమయంలో ఏపుగా పెరిగి ఔషధ గుణాలు, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడే ఎకో ఫ్రెండ్లీ మొక్కల ఎంపికకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. 3.30లక్షల మొక్కలు అందుబాటులో ఉన్నాయని అధికారులు కమిషనర్‌కు తెలిపారు. కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి రమేష్, అసిస్టెంట్లు ప్రిన్సి, అశ్విని, ప్రవళిక, అనూహ పాల్గొన్నారు.

ఆఫీసర్ లైఫ్ స్టైల్

ఠారెత్తిస్తున్న ఖరే

సరిహద్దులో మాఫియాలకు గుబులు - అక్రమార్కులు, అసాంఘిక శక్తుల్లో కలవరం

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి : మాఫియాలో గుబులు రేపారు. అక్రమార్కుల్లో కలవరం సృష్టించారు. ఇసుకాసురులను హడలెత్తిస్తున్నారు. భూకబ్జాదారుల గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తున్నారు. వడ్డీ వ్యాపారుల్లో వణుకు పుట్టించారు. పీడీఎస్ రైస్, బెల్లం వ్యాపారులను టెన్షన్ లో పడేశారు. గంజాయి రవాణా దారులపై ఉక్కు పాదం మోపుతున్నారు. నక్సల్స్ కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించారు. మొత్తానికి అసాంఘిక శక్తులను ఠారెత్తిస్తున్నారు. ఆయనే జయశంకర్ భూపాలపల్లి జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్పీ) కిరణ్ ఖరే. రాష్ట్రంలో మావోయిస్టు ప్రభావిత జిల్లాల్లో భూపాలపల్లి ఒకటి. మూడు రాష్ట్రాల సరిహద్దులో గల ఈ జిల్లాలో ఎస్పీగా కిరణ్ ఖరే తమదైన ముద్ర వేస్తున్నారు. శాంతి భద్రతల నిర్వహణలో తనదైన శైలి కనబరుస్తున్నారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజలతో మమేకం అవుతున్నారు. సమస్యలతో పోలీసులను ఆశ్రయిస్తున్న ఫిర్యాదారులకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. విధి నిర్వహణలో తప్పు చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటున్నారు. ఇదే సమయంలో చట్టపరంగా నడుచుకుంటూ ఉత్తమ సేవలు అందిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బందిని ఆయన ప్రోత్సహిస్తున్నారు. ఐపీఎస్ గా పోలీసు శాఖలో అడుగుపెట్టినప్పటి నుంచి ఖరే తాను పనిచేసిన ప్రతిచోట సమర్థుడైన అధికారిగా ప్రశంసలు పొందారు. ప్రస్తుతం మహారాష్ట్ర, ఛత్తీస్ గడ్ సరిహద్దులో అనేక ప్రత్యేకతలకు నెలవైన భూపాలపల్లి జిల్లాలో తన మార్క్ చాటుతున్నారు. అటవీ, మైదాన ప్రాంతం, మావోయిస్టుల ప్రభావం, బొగ్గు గనులు, కేటీపీపీ, ఇసుక క్వారీలు, కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ, అన్నారం వంటి బ్యారేజీలు, పెంపు హౌస్ లు కలిగి ఉన్న ఈ జిల్లాలో గత ఎనిమిది నెలలుగా పనిచేస్తున్న భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరేపై 'అక్షర దర్బార్' స్పెషల్ స్టోరి.

- పీడీఎస్ రైస్, బెల్లం వ్యాపారుల్లో కలకలం
- అధిక వడ్డీ వ్యాపారుల్లోనూ వణుకు
- భూ కబ్జాదారులు, గంజాయి రవాణా దారులపై ఉక్కుపాదం
- ఇసుకాసురులపై గట్టి నిఘా
- నక్సల్స్ కార్యకలాపాలపై స్పెషల్ ఫోకస్
- ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక పీఎస్ ఏర్పాటు
- ఆకస్మిక తనిఖీలతో హడల్
- ప్రతి సోమవారం 'ప్రజాదివస్'కు శ్రీకారం
- సైబర్ నేరాలపై ప్రజల్లో చైతన్యం
- శాంతి భద్రతల నిర్వహణలో తనదైన మార్క్
- భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరేపై 'అక్షర దర్బార్' స్పెషల్ స్టోరీ

ఎక్కడ పనిచేసినా తనదైన ముద్ర

భూపాలపల్లి జిల్లా ఎస్పీగా కిరణ్ ఖరే 2023 అక్టోబర్ 13న బాధ్యతలు స్వీకరించారు. 2017 ఐపీఎస్ బ్యాచ్ కు చెందిన అధికారి. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని సౌత్ వెస్ట్ జోన్ డీసీపీగా విధులు నిర్వహించారు. టీఎస్ పీఎస్సీ పేపర్ లీకేజీ కేసు విచారణలో ఆయన కీలకంగా వ్యవహరించారు. బైంసా ఏఎస్పీగానూ ఆయన బాధ్యతలు నిర్వహించారు. అక్కడ కూడా తనదైన శైలిని ప్రదర్శించారు. బైంసాలో జరిగిన సంఘటనల్లో నిందితులను పట్టుకోవడంలో ప్రధాన పాత్ర పోషించారు. బైంసాలోని ఆటోనగర్, ఎన్ఆర్ గార్డెన్ ప్రాంతాల్లో వరదల్లో 2021లో 160మంది చిక్కుకున్నారు. వారిని కాపాడటంలో ఆయనదే ముఖ్య భూమిక. బాసర, మీర్జాపూర్ నుంచి గజ ఈతగాళ్లను అప్పటికప్పుడు రప్పించి వరద బాధితులను కాపాడగలిగారు. బైంసాలో శివుని విగ్రహం ధ్వంసం చేసిన నిందితుడిని 24 గంటల్లో పట్టుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఎక్కడ పనిచేసినా తనదైన శైలిని ప్రదర్శించే కిరణ్ భూపాలపల్లి జిల్లా ఎస్పీగా విధుల్లో చేరాక కూడా అదే తీరును కొనసాగిస్తున్నారు.

గొత్తికోయలపై ఫోకస్

మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తూ వారిలో ధైర్యాన్ని నింపారు. నేరాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో రాజీ పడకుండా ముందుకు సాగుతున్నారు కిరణ్ ఖరే. గతంలో మావోయిస్టులు భూపాలపల్లి ప్రాంతం కేంద్రంగా తమ పార్టీ కార్యకలాపాలు నిర్వహించారు. ప్రస్తుతం మావోయిస్టుల కార్యకలాపాలు కనపడటం లేదని పోలీసులు చెబుతున్నారు . అటవీ ప్రాంత ప్రజలకు పోలీసు శాఖ అండగా ఉంటుందని ధైర్యాన్ని ఇస్తున్నారు. పోలీసు శాఖ నేతృత్వంలో ఇటీవల మెగా వైద్య శిబిరం నిర్వహించారు. పలిమెల, మహాముత్తారం, భూపాలపల్లి మండలాల్లోని మారుమూల ప్రాంతాల గొత్తి కోయలు, గ్రామీణులు వైద్య సేవలు పొందారు. హైదరాబాద్ మలక్ పేట యశోద ఆస్పత్రి సౌజన్యంతో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ సహకారంతో మెగా వైద్య

శిబిరం సక్సెస్ ఫుల్ గా నిర్వహించి పేదల ఆరోగ్యం పట్ల ఆయన ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. శిబిరంలో మెడిసిన్స్ ఉచితంగా పంపిణీ చేయడంతో పాటు, ఉచిత బోజన వసతి కల్పించారు. చలి నుంచి కాపాడుకోవడానికి గొత్తి కోయలకు దుప్పట్లు పంపిణీ చేశారు. గొత్తి కోయల అభ్యున్నతికి వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు. అటవీ ప్రాంత, గొత్తి కోయల కుటుంబాలకు అవసరమైన సాయం అందించాలని స్థానిక పోలీసులను ఆదేశించారు.

వడ్డీ వ్యాపారులపై సీరియస్

ప్రజల ఆర్థిక అవసరాలను దృష్టిలో ఉంచుకొని భారీగా వడ్డీలు వసూలు చేస్తున్న వ్యాపారులపై ఖరే ఉక్కుపాదం మోపారు. అధిక వడ్డీ వసూలు చేస్తున్న వారిపై కేసులు పెట్టారు. జిల్లాలో అధిక వడ్డీ, ఫైనాన్స్ వ్యాపారుల విషయం తెలియగానే వసూలు చేస్తున్న వారి వివరాలు సేకరించి జిల్లా వ్యాప్తంగా ఫైనాన్స్ ఆఫీసులపై పోలీసులు దాడులు చేశారు. ఒత్తిళ్లకు లొంగకుండా ఒకే రోజు 12 మందిపై కేసులు పెట్టి ప్రజల్లో ధైర్యం నింపారు. భూపాలపల్లి, కాటారం, మహాదేవ్ పూర్ లో ఏకకాలంలో వడ్డీ, ఫైనాన్స్ వ్యాపారుల ఇల్లు, కార్యాలయాలపై 12 బృందాలతో ఈ దాడులు చేశారు. ఈ దాడుల్లో 193 ప్రామిసరీ నోట్లు, 93 ఏటీఎం కార్డులు, 61 ఖాళీ చెక్కులు, 28 బ్యాంకు పాసు బుక్కులు, 109 బ్యాంకు చెక్కులు, 13 బాండ్ పేపర్లు, 11 పట్టా పాస్ బుక్కులు, రూ.3,71 240 స్వాధీనం చేసుకున్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ పేదల నుండి అధిక వడ్డీ వసూలు చేసే అక్రమ వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు.

ప్రశాంతంగా ఎన్నికలు

కిరణ్ ఖరే ఎస్పీగా భూపాలపల్లికి వచ్చిన కొద్ది రోజులకే శాసనసభ ఎన్నికలు జరిగాయి. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరగడంలో కీలక భూమిక వహించారు. అదే ధీమాతో పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరగడంలోనూ తన పాత్ర పోషించారు. ప్రజల శాంతి భద్రతలను కాపాడటానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్న ఎస్పీ ఆకస్మిక తనిఖీలతో కింది స్థాయి అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. ఏ పోలీస్ స్టేషన్ కు వెళితే అక్కడి రిపోర్ట్స్, కేసుల పురోగతిపై ఠాణా అధికారుల ద్వారా వివరాలు సేకరిస్తున్నారు. అక్రమ ఇసుక రవాణా పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నారు. అక్రమ ఇసుక రవాణా చేసే అవకాశం ఉన్న మానేరు వాగును పరిశీలించి స్థానిక ఎస్సైకి పలు సూచనలు చేశారు. ఇసుకాసురులపై చర్యలు తీసుకోవడానికి వెనుకాడటం లేదు. 'ప్రజాదివాస్' తో ప్రజలతో మమేకమవుతున్నారు. ప్రతి సోమవారం ఈ కార్యక్రమం నిర్వహిస్తూ ప్రజల నుంచి వినతులు స్వీకరించి సమస్యలు పరిష్కరిస్తున్నారు. సైబర్ నేరాల పట్ల జిల్లా వాసులను చైతన్యవంతుల్ని చేస్తున్నారు. నూతన టెక్నాలజీతో నేరగాళ్లు ఎలా మోసం చేస్తారు, నేరగాళ్ల పట్ల ఎలా వ్యవహరించాలో ప్రజలకు చెపుతూ ఆలోచింప చేస్తున్నారు. ఫోన్లకు వచ్చే లింక్ లు, ఓటీపీ, పాస్ వర్డ్ విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచిస్తున్నారు. అపరిచిత వ్యక్తులతో ఛాటింగ్ కు దూరంగా ఉండాలని ప్రధానంగా యువతకు వివరిస్తున్నారు. లాటరీలు, బ్యాంకు లోన్లు, ఉద్యోగాలు ఇప్పిస్తామని అపరిచిత వ్యక్తుల వచ్చే మెసెజ్ లకు, ఫోన్లకు స్పందించ వద్దని జిల్లా వాసులకు పలు సందర్భాల్లో హితవు పలికారు.

భూకబ్జాదారులకు చెక్

భూ కబ్జాలకు పాల్పడిన వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నారు. భూకబ్జా కేసులో ఇటీవల భూపాలపల్లి కౌన్సిలర్ కొత్త హరిబాబును అరెస్ట్ చేయడం సంచలనమైంది. రియల్ దందా బాధితులు ధైర్యంగా ఠాణాలో ఫిర్యాదు చేయాలని బహిరంగంగా ప్రకటించడంతో దందా చేసే వారు వెనక్కి తగ్గారు. భూపాలపల్లి పరిధిలోని కాసింపల్లి వాసికి చెందిన జామాయిల్ తోటను ధ్వంసం చేసి, కాపలాదారులపై దాడి చేసి అక్రమంగా జామాయిల్ తోటలో రోడ్లు వేసి పక్కా ప్రణాళికతో బాధితుడి భూమిని కబ్జా చేసేందుకు యత్నించిన సంఘటనపై బాధితుడి పిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు మున్సిపల్ కౌన్సిలర్ కొత్త హరిబాబుని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. ఎస్పీ వైఖరితో కబ్జాదారులు వణికిపోతున్నారు. జిల్లాలో గంజాయి రవాణా చేసేందుకు అక్రమార్కులు భయపడిపోతున్నారు. గంజాయిని అడ్డుకోవడానికి ఆయన స్పెషల్ ఫోకస్ పెట్టారు. జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేకంగా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేశారు. మాఫియాలో గుబులు రేపి పీడీఎస్ రైస్, బెల్లం వ్యాపారాలకు అడ్డుకట్ట వేసే పనిలో ఉన్నారు. నక్సల్స్ కార్యకలాపాలపైనా ప్రత్యేక దృష్టి సారించారు.

తప్పు చేస్తే... వేటే

విధి నిర్వహణలో తప్పు చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవడంలో ఖరే వెనుకాడటం లేదు. విచారణ నివేదికలు త్వరితగతిన తెప్పించుకుని నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇటీవల ఓ పోలీస్ స్టేషన్ లో బర్త్ డే వేడుకలు జరుగగా ఆ వేడుకల్లో పాల్గొన్న ఎస్ఐపై బదిలీ వేటు వేశారు. మహదేవపూర్ పోలీస్ స్టేషన్ లో ఓ రాజకీయ నేత డ్యాన్స్ చేసిన ఘటనలో ఎస్సైని వీఆర్ కు బదిలీ చేశారు. హెడ్ కానిస్టేబుల్ ను సస్పెండ్ చేశారు. ఇదే పీఎస్ లో మరి కొంత మంది సిబ్బందిని కూడా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలతో అప్పుడే బదిలీ చేయడం సంచలనం రేపింది.

కాంగ్రెస్ కే వామపక్షాల మద్దతు

సీఎంతో భేటీ అయిన వామపక్ష నేతల

ఎమ్మెల్సీ ఎన్నికల్లో తీన్మార్ మల్లన్నకు మద్దతిస్తున్నట్లు వెల్లడి

అక్షర దర్బార్, హైదరాబాద్: వామపక్ష పార్టీల నేతలు శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా హస్తం పార్టీకి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు వెల్లడించారు. సీపీఐ, సీపీఎం, తెలంగాణ జన సమితి నేతలు ప్రొఫెసర్ కోదండరాం, ప్రొఫెసర్ విశ్వేశ్వర్ రావు, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జూలకంటి రంగారెడ్డి, ఎస్.వీరయ్య, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్, మల్లు రవి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, బొంతు రామ్మోహన్, తదితరులు ఈ భేటీకి హాజరయ్యారు. నల్గొండ– ఖమ్మం– వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక, చివరి రోజు ప్రచార సరళిపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఉప ఎన్నికపై రేవంత్ రెడ్డి సమీక్షించారని ఎమ్మెల్సీ మహేశ్కుమార్ గౌడ్ పేర్కొన్నారు. సీపీఐ, సీపీఎం, జన సమితి పార్టీలు పూర్తిగా కాంగ్రెస్కు మద్దతుగా నిలుస్తున్నాయని తెలిపారు. ఈ క్రమంలోనే తమ అభ్యర్థి తీన్మార్ మల్లన్న భారీ మెజారిటీతో గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని కోరిన ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ప్రజాస్వామ్యం బతకాలంటే తీన్మార్ మల్లన్న గెలవాలని అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ ను గెలిపించేందుకు సీపీఐ నాయకులు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

సీఎం రేవంత్ రెడ్డితో భేటీ అయిన వామపక్ష పార్టీల నాయకులు

గన్ పౌడర్ పరిశ్రమలో భారీ పేలుడు..

- 17 మంది మృతి
- ఆరుగురికి గాయాలు

అక్షర దర్బార్, రాయ్ పుర్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. బెమెతెరా జిల్లాలోని గన్ పౌడర్ తయారీ పరిశ్రమలో పేలుడు జరగడం వల్ల 17 మంది మరణించారు. మరో ఆరుగురు గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను అంబులెన్స్లో రాయ్పుర్లోని ఓ ఆసుపత్రికి తరలించారు. బెమెతెరా కలెక్టర్ రణ్బీర్ శర్మ ప్రమాదస్థలికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు.

ఇంకా గ్యాస్ లీక్..

పేలుడు సంభవించిన గన్ పౌడర్ ఫ్యాక్టరీ వద్దకు రాయ్పుర్, దుర్గ్ అగ్నిమాపక దళాలు, ఎస్డీఆర్ఎఫ్ రెస్క్యూ టీమ్ చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. పేలుడు తర్వాత కూడా ఫ్యాక్టరీలో గ్యాస్ లీక్ అవుతుందని రెస్క్యూ బృందాలు తెలిపాయి. మరోవైపు, గన్ పౌడర్ ఫ్యాక్టరీలో పేలుడుకి గల కారణాలు ఇంకా తెలియరాలేదని పోలీసులు తెలిపారు. పేలుడు తీవ్రత ఎక్కువగా ఉండడం వల్ల వందల అడుగుల ఎత్తులో ఉన్న కరెంట్ తీగలు కూడా కాలిపోయాయని పేర్కొన్నారు. ఒక విద్యుత్ స్తంభం కూడా కూలిపోయిందని చెప్పారు.

ఇళ్లు ధ్వంసం

బెర్లా బ్లాక్‌లోని బోర్సీ గ్రామంలో ఉన్న గన్ పౌడర్ ఫ్యాక్టరీలో శనివారం ఉదయం పేలుడు సంభవించింది. పేలుడు ధాటికి గ్రామంలోని చాలా ఇళ్లు ధ్వంసమయ్యాయి. దీంతో ప్రజలు ఆందోళనకు గురై ఇళ్ల నుంచి బయటకు వచ్చారు. దట్టమైన పొగలు వ్యాపించడం వల్ల ఫ్యాక్టరీ వద్ద వేలాది మంది ప్రజలు భారీగా గుమిగూడారు. వారు తీవ్ర ఆగ్రహంతో ఫ్యాక్టరీ కార్యాలయాన్ని ధ్వంసం చేసినట్లు తెలుస్తోంది. పేలుడు తర్వాత శిథిలాల కింద కొందరు ఉండిపోయినట్లు సమాచారం

ప్రమాదంపై విచారణ

గన్ పౌడర్ ఫ్యాక్టరీ పేలుడు ప్రమాదంలో గాయపడినవారిని త్వరగా ఆసుపత్రికి తరలించేందుకు అన్ని విధాలా సాయం చేస్తామని రాయ్ పుర్ ట్రాఫిక్ డీఎస్పీ గుర్జీత్ సింగ్ తెలిపారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తీసుకురావడంలో ఎలాంటి సమస్య ఉండకూడదని అన్నారు. క్షతగాత్రులను తీసుకువస్తున్న అంబులెన్స్ కు ట్రాఫిక్ లేకుండా చేశామని చెప్పారు. ఈ ప్రమాదంపై విచారణ జరుగుతోందని ఛత్తీస్ గఢ్ డిప్యూటీ సీఎం విజయ్ శర్మ వెల్లడించారు.

వివరాలు వెల్లడిస్తున్న సీఐ మల్లేష్ యాదవ్, ఎస్సై రవికుమార్

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

- ఆరు నెలల కింద జరిగిన మర్డర్ కేసును ఛేదించిన పోలీసులు
- కన్న కొడుకుని కడతేర్చిన కసాయి తండ్రి

అక్షర దర్బార్,రేగొండ : వ్యాపారం దివాలా తీయడానికి కారణం కన్నకొడుకేనని, చెప్పిన మాట వినడం లేదని కన్న తండ్రి కసాయిగా మారి కొడుకును హతమార్చిన ఘటనలో పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. ఈ మేరకు చిట్యాల సీఐ దగ్గు మల్లేష్ యాదవ్, ఎస్సై ఎన్ఆర్ రవికుమార్ శనివారం వివరాలు వెల్లడించారు. రేగొండ మండలం నారాయణపురం గ్రామానికి చెందిన పెరుగు లింగమూర్తి రేగొండ, పరకాల, టేకుమట్ల మండల కేంద్రాల్లో సూపర్ మార్కెట్ వ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్నాడు. లింగమూర్తికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కాగా చిన్న కుమారుడు సాయి గణేష్ (23) చదువులో రాణించకపోవడంతో పరకాల సూపర్ మార్కెట్ ను అప్పగించాడు. ఈ క్రమంలో వ్యాపారం దివాలా తీయడానికి కారణం కొడుకేనని భావించిన లింగమూర్తి చెప్పిన మాట వినడం లేదని ఎలాగైనా అడ్డు తొలగించుకోవాలని పథకం వేశాడు. ఈ క్రమంలోనే గతేడాది నవంబర్ లో సాయి గణేష్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు అప్పటి ఎస్సై శ్రీకాంత్ రెడ్డి కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం వివరాల్లో అనుమానం రావడంతో విచారణ చేపట్టగా హత్య విషయం వెల్లడైనట్లు సీఐ మల్లేష్ యాదవ్ తెలిపారు. విచారణ చేపట్టగా మృతుడి తండ్రి హత్య చేసినట్లు నిర్ధారణ కావడంతో నిందితుడిని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

వెంకటాపురం గ్రామ వాకర్స్ కమిటీ ఎన్నిక..

అక్షర దర్బార్, దుగ్గొండి: దుగ్గొండి మండలం వెంకటాపురం గ్రామ వాకర్స్ అసోసియేషన్ కమిటీని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కక్కెర్ల సాంబయ్య, ఉపాధ్యక్షుడిగా ముత్యాల నాగేష్, కార్యదర్శిగా తాళ్లపల్లి వీరస్వామి, ట్రెజరర్ గా గోర్కటి రాజు కుమార్, చీఫ్ ప్రెసిడెంట్ ఏరుకొండ కర్ణాకర్, అడ్వైజరీ మెంబర్ గా కక్కెర్ల రమేష్, సభ్యులుగా పోగాకు రమేష్, గోర్కటి రఘుపతి, గోర్కటి రాజును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సాంబయ్య మాట్లాడుతూ అందరూ ఆరోగ్యంగా ఉండాలని, అందుకు నడక తొలి మెట్టు అని అన్నారు.

తీన్మార్ మల్లన్నను గెలిపించండి

డాక్టర్ మడికొండ శ్రీను

అక్షర దర్బార్, పరకాల : వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని డాక్టర్ మడికొండ శ్రీను, అడ్వకేట్ పెద్దెల్లి ప్రకాష్ కోరారు. తీన్మార్ మల్లన్న గెలిస్తే విద్యావంతులు, నిరుద్యోగులు, ప్రజల పక్షాన మండలిలో ప్రశ్నించే గొంతుక అవుతాడని అన్నారు. కేంద్రం, రాష్ట్రంలో పదేళ్లు అధికారంలో ఉన్న బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు పట్టభద్రులను ఓట్లు అడిగే నైతిక హక్కు లేదని పెద్దెల్లి ప్రకాష్ అన్నారు. తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని వారు కోరారు.

డాక్టర్ మడికొండ శ్రీను

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మరొకరికి తీవ్ర గాయాలు

అక్షర దర్బార్, జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : పరకాల-భూపాలపల్లి జాతీయ రహదారిపై ఘనపురం మండలం లక్ష్మారెడ్డి పల్లి వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. లక్ష్మారెడ్డిపల్లి వద్ద ఎదురెదురుగా వస్తున్న కారు, బైక్ ఢీకొన్నాయి. ఈ ఘటనలో రేగొండ మండలం జగ్గయ్యపేట గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఇంచర్ల రాజు మృతి చెందగా, నవీన్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

కమనీయం హనుమాన్ శోభాయాత్ర

వైభవంగా ఊరేగింపు

అక్షర దర్బార్, రేగొండ: హనుమాన్ శోభాయాత్ర అంగరంగ వైభవంగా జరిగింది. మండలంలోని తిరుమలగిరి గ్రామంలో హనుమాన్ మాలధారులు శనివారం హనుమాన్ శోభాయాత్రను వైభవంగా చేపట్టారు. హనుమాన్ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగిస్తూ ర్యాలీ చేపట్టారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఆంజనేయుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసి గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. శోభాయాత్రకు మహిళా భక్తులు మంగళ హారతులు, కొబ్బరికాయలతో స్వాగతం పలికారు. శోభాయాత్రతో గ్రామంలో సందడిగా నెలకొంది. యాత్రలో హనుమాన్ మాలధారులు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శోభాయాత్రలో పాల్గొన్న హనుమాన్ మాలధారులు